స్వచ్ఛదనం.. పచ్చదనం

భాగస్వాములైతే భవిష్యత్ హరితమయం


పార్సిగుట్టలో చెత్తాచెదారాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియ


గోల్నాక మార్కెట్ పరిసరాల్లో వ్యర్థాలను తొలగిస్తున్న కార్పొరేటర్ అమృత

ముషీరాబాద్: స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. సోమవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా పార్సిగుట్ట శ్మశానవాటిక వద్ద పేరుకుపోయిన చెత్త, మట్టకుప్పలను తొలగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అన్నారు. ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, నాయకులు సత్యానారాయణ, వెంకటేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్ డివిజన్‌లో..

భోలక్‌పూర్ డివిజన్‌లోని గుల్షన్‌నగర్‌లో స్వచ్ఛదనం – పచ్చదనంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గౌసుద్దీన్, ఎస్ఎఫ్ఏలు హరినాథ్, రజ్వీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు.


ముషీరాబాద్ పాఠశాలలో వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఐవోఎస్ స్వరూపరాణి


బాగ్‌అంబర్‌పేటలో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో కార్పొరేటర్, అధికారులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత..

నల్లకుంట: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్–16 ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంటలో 'స్వచ్ఛదనం – పచ్చదనం'కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి హాజరైన కార్పొరేటర్ గోల్నాక వెజిటేబుల్ మార్కెట్ పరిసర ప్రాంతాలలో వీధుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. అలాగే స్వచ్ఛదనంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈనెల 13వ తేదీ వరకు స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి..

అంబర్‌పేట: స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంతో పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించే అవకాశం మెండుగా ఉందని అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల్లో స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అధికారులు హరినాథ్‌గౌడ్, ఆదిల్, ఆంజనేయులు, శ్రీధర్, రవి పాల్గొన్నారు.

జైస్వాల్ గార్డెన్‌లో..

అలాగే గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్‌లో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు చింతాల ముదిరాజ్ స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు.

విద్యార్థుల చేతుల్లోనే 'స్వచ్ఛ' భవిత

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


కాచిగూడలో ప్రజాప్రతినిధులు, కార్మికులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్

కాచిగూడ: విద్యార్థి దశలోనే 'స్వచ్ఛదనం.. పచ్చదనం'పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో కంటే మంచి ఫలితాలు తీసుకురావడానికి కృషి చేయాలని ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులకు సూచించారు. కళాశాలలో, పాఠశాలలో మరిన్ని మెరుగైన వసతులను కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల మైదానంలో పేరుకుపోయిన చెత్తను ఊడ్చి స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... వ్యక్తిగత, పరిసరాల శుభ్రత విషయంలో పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛదనం.. పచ్చదనం లక్ష్యాలను చేరుకోవాలంటే విద్యార్థుల్లో చైతన్యం పెంచాలన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. చిన్న చిన్న కారణాల వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. పరిశుభ్రత వాతావరణంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, డిప్యూటీ ఐఓఎస్ రామావత్ సుమన్ రాథోడ్, డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్ఓ డాక్టర్ హేమలత, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు, విద్యాశాఖ అధికారులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్–11కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలుప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. అంబర్‌పేట్ ఫీడర్ పరిధిలో ఎంసీహెచ్ కాలనీ, ఆకాష్‌నగర్, రామకృష్ణానగర్, రఘునాథ్‌నగర్, వినాయక్‌నగర్, రెడ్‌బిల్డింగ్ 10 నుంచి 11.30 వరకు, ప్లే గ్రౌండ్ ఫీడర్ పరిధిలో బుర్రుగల్లి, కుమ్మరివాడి, ఎరుకలబస్తీ, గాంధీ విగ్రహం, రహత్‌నగర్, వాణి ఫొటో స్టూడియో తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి ఒంటి గంట వరకు, అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలో సాయిదత్త నర్సింగ్ హోమ్, టెలిఫోన్ ఎక్స్చేంజ్, శివం, మల్లికార్జుననగర్, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఫలహారబండ్ల ఊరేగింపు

ముషీరాబాద్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో ప్రసిద్ధిగాంచిన భూలక్ష్మి దేవాలయం నుంచి సోమవారం సాయంత్రం పోతరాజులు, ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతరాజుల నృత్యాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, నాయకులు ముప్పిడి నర్సింగ్‌రావు, పరశరాం, నాగేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే లక్ష్యంపై స్పష్టత ఉండాలి

అంబర్‌పేట: విద్యార్థులు లక్ష్యం కోసం క్రమశిక్షణతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని ఎయిర్‌ఫోర్స్ వింగ్ రిటైర్డ్ కమాండర్ శృతి కులకర్ణి సూచించారు. డీడీ కాలనీలోని బచపన్ అకాడమిక్ హైట్స్ పాఠశాలలో విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికపై ప్రత్యేక అవగాహన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని కలిగి ఉండాలని సూచించారు. సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉంటే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తవన్నారు. క్రమశిక్షణ, సమయపాలన వంటి అంశాలను పాటించాలన్నారు.

నగరంలో బస్సుల సంఖ్య పెంచాలి

ముషీరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో పెరిగిన జనాభాకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని ముషీరాబాద్ సీపీఎం జోన్ సీనియర్ నాయకులు బాబన్న, శ్రీరాములు డిమాండ్ చేశారు. సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల బస్టాప్ వద్ద ప్రయాణికుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులు, విద్యార్థులు, చిరువ్యాపారుల రాకపోకలకు సరిపడా బస్సులు లేక, సమయానికి రాక, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావొస్తున్నా సరిపడా బస్సులు నడపడం లేదని విమర్శించారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా తక్షణమే బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో పల్లెల వీరస్వామి


మాట్లాడుతున్న పల్లెల వీరస్వామి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బంధు సొసైటీ హైదరాబాద్ అధ్యక్షుడు పల్లెల వీరస్వామి అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ హైదరాబాద్, మాదిగ మేధావుల ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. పల్లెల వీరస్వామి మాట్లాడుతూ... మూడు దశాబ్దాల కాలంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతో మంది మాదిగలు ప్రాణాలు అర్పించారన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు వర్తిస్తుందని తెలిపారు.

◆ రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి ఏ.భరత్‌భూషణ్ మాట్లాడుతూ... మాదిగల్లోని అన్ని కులాల వారికి సామాజిక న్యాయం జరిగే విధంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

◆ మాదిగ మేధావుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే ఎస్సీ వర్గీకరణపై ఆర్డినెన్స్ జారీ చేసి మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఈటికాల పురుషోత్తం, ప్రొఫెసర్ నతానియల్, నల్లా రాధాకృష్ణ, వివిధ సంఘాల నాయకులు వశపాక నర్సింహ్మ, మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు గడ్డ యాదయ్య, శ్రీనివాస్, ఎర్ర దేవదానం, గండి కృష్ణ, ప్రొఫెసర్ తిరుపతి, పవన్‌కుమార్, ఆశోక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ విమలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో చేరడానికి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిప్లొమా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆగస్టు 10 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నం. 78931 41797.

హైదరాబాద్ జేసీఎల్‌గా సునీత గోపాల్‌దాస్



చిక్కడపల్లి: హైదరాబాద్ జిల్లా సంయుక్త కార్మిక కమిషనర్‌గా సునీత గోపాల్‌దాస్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కార్మికుల సమస్యలు సత్వరం పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటనన్నారు. అసంఘిటిత రంగ కార్మికులందరూ ఈశ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈశ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు కార్యక్రమంలో నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ పోర్టల్–ఏలో నమోదైన కార్మికుడికి రూ.2లక్షల ప్రమాద బీమా కవరేజీ ఉంటుందన్నారు. నూతన కమిషనర్ కృష్ణ ఆదిత్య శాఖలో అనేక మార్పులు తీసుకురావడంతో కార్మికులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

సేవలు స్ఫూర్తిదాయకం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అన్నదానం మహాదానం అని పోలీసు హౌజింగ్ బోర్డు మాజీ చైర్మన్ పోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. అమావాస్యను పురస్కరించుకొని మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట ఆధ్వర్యంలో వీఎస్‌టీలోని కట్టమైసమ్మ ఆలయం వద్ద సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు 500 మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజావాణికి స్పందన కరువు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రజలు ఒక్కరూ కూడా సమస్యలు చెప్పుకోవడానికి రాకపోవడం పట్ల విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణి మొదటి రోజే ఇలా కావడంతో అధికారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. అన్ని రకాల సర్టిఫికెట్లతో పాటు డబుల్ బెడ్‌రూమ్ తదితర సమస్యలను ప్రజావాణిలో విన్నవించుకోవచ్చు. ప్రజా భవన్‌లో ఇచ్చే అన్ని రకాల పిటిషన్స్ కూడా ప్రజావాణిలో స్వీకరించి ఆయా శాఖలకు వినతి పత్రాలను సమర్పించి వాటి పరిష్కారానికి మండల అధికారులు కృషి చేస్తారు. ఇప్పటికైనా ప్రజలు భాగస్వాములు కావాలని అధికారులు ఆశిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే ఉపకులాల ఐక్యత సాధ్యం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ


లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కవాడిగూడ: ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దళితుల్లో ఉన్న అన్ని కులాలు స్వాగతించాలని... వర్గీకరణను వ్యతిరేకించడం అంటే అంబేడ్కర్‌ను వ్యతిరేకించడమే అవుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట అధ్యక్షుడు గోవింద్ నరేష్‌మాదిగ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై కొంతమంది స్వార్థపరులు వ్యతిరేకించడాన్ని నిరసిస్తూ సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఎస్సీ జాబితాలో ఉన్న అన్ని కులాలకు రిజర్వేషన్ అందాలని ఆశిస్తే 70ఏళ్లుగా రిజర్వేషన్లను కొన్ని కులాలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణతో రిజర్వేషన్ ఫలాలు అన్ని కులాలకు లభిస్తాయని అప్పుడే అంబేడ్కర్ ఆశయం నెరవేరుతుందని పేర్కొన్నారు.

◆ ఈ తీర్పును బీఎస్పీ అధినేత మాయావతి, చిరాక్‌పాశ్వాన్, రాందాస్ హథవాలే వ్యతిరేకిస్తూ రిజర్వేషన్ల దోపిడీకి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. వీరికి అంబేడ్కర్ పేరు పలికే అర్హత లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోతే మాల, మాదిగ ఉపకులాల మధ్య వైశమ్యాలు మరింత పెరుగుతాయని అన్నారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రాబోతున్న మందకృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు నరసింహ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట ఉపాధ్యక్షుడు రామారపు శ్రీనివాస్‌మాదిగ, మాదిగ విద్యార్థి విభాగం రాష్ట అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సన్ రాజు, నాయకులు బి. శివకుమార్, వీఎస్ రాజు, శివ, ఆదిత్య, శ్రీను, రాజు యాదవ్ పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలి

నల్లకుంట: నిరుపేద రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో వైద్య సిబ్బంది కొరత లేకుండా చూడాలని నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత ప్రభుత్వాన్ని కోరారు. డివిజన్ పరిధిలోని నర్సింహబస్తీ, తిలక్‌నగర్‌లోని బస్తీ దవాఖానాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయా? అని అక్కడి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని అక్కడి సిబ్బందికి సూచించారు. అలాగే రోగ నిర్ధారణ పరీక్షల్లో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. బస్తీ దవాఖానాల వైద్యులు, సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని వినతి

అంబర్‌పేట: దళితుల అభ్యున్నతికి కాంగ్రెస్ హామీ ఇచ్చిన మేరకు చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు రాష్ట ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ ఎం.శివకుమార్ ఆధ్వర్యంలో అంబర్‌పేట తహసీల్దార్ వీరాబాయికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమానికి హాజరైన గౌతమ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని ఆయన విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుంటే ఆ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడతామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమారమేశ్‌యాదవ్, అమృత, నాయకులు అజయ్‌కుమార్, శ్యాంరాజ్, మహేశ్, శేర్ సాగర్, శ్రీకాంత్, లక్ష్మణ్‌కుమార్, రాంచందర్, నాగభూషణం చారి, చుక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, డీఎంసీ ఖాదర్‌మోహినోద్దీన్

కవాడిగూడ: వాతావరణంలో మార్పుల కారణంగా నగరంలో రోజురోజుకూ విజృంభిస్తున్న డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ జి. రచనశ్రీ, సర్కిల్ –15 డీఎంసీ ఖాదర్ మోహినొద్దీన్ సూచించారు. డీబీఆర్ మిల్స్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో కవాడిగూడ డివిజన్ బండ మైసమ్మ నగర్ కమ్యూనిటీ హాల్‌లో 5 రోజుల పాటు నిర్వహించే హెల్త్ క్యాంపును కార్పొరేటర్ జి.రచనశ్రీ, డీఎంసీ ఖాదర్ మోహినొద్దీన్ ముఖ్యఅతిథులుగా హాజరై సోమవారం ప్రారంభించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ప్రజలు క్యాంపులో పాల్గొని వైద్యపరీక్షలు చేసుకోగా వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభమైనందుకు నగరంలో రోజురోజుకు పెరుగుతున్న విషజ్వరాలు, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు, ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే ధ్యేయంగా 5 రోజుల పాటు ప్రత్యేకంగా కవాడిగూడ బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని, దీన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్–15 ఏఎంవోహెచ్ డాక్టర్ మైత్రేయి, డాక్టర్ అవంతి, ఎంటమాలజిస్ట్ విభాగం అధికారి మహేష్‌కుమార్, ఏఎన్ఎం సుశీల, అంగన్‌వాడీ టీచర్‌లు స్వప్న, శారద, ఆశా వర్కర్లు నాగమణి, లక్ష్మి, లత, మలేరియా సూపర్‌వైజర్లు అశోక్‌వర్ధన్, కృష్ణ, ఇస్మాయిల్, బీజేపీ రాష్ట నాయకులు బి.వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్ కలెక్టర్లను ఆదుకోవాలి

రాష్ట యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్


నిరాహార దీక్షలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్‌రావు

కవాడిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంతో ఉపాధి కోల్పోయిన విద్యుత్ బిల్ కలెక్టర్లను ఆదుకోవాలని రాష్ట యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కె. ఈశ్వర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈఆర్‌వో, ఎస్ఈ, డీఈ కార్యాలయాల్లో వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు యూనియన్ రాష్ట అధ్యక్షుడు కె. ఈశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి వి. గోవర్ధన్, బిల్‌కలెక్టర్ కె. రమేష్ హాజరై మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం 200యూనిట్లకు జీరో బిల్ సిస్టమ్ అమలు చేసిన తరువాత 80శాతం మంది వినియోగదారులు బిల్లులు చెల్లించడం లేదన్నారు. దానితో పాటు ఆన్‌లైన్ సిస్టమ్ ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో సంస్థను నమ్ముకొని పనిచేస్తున్న బిల్‌కలెక్టర్లు (పీస్ రేట్ ఉద్యోగులు) ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం పట్ల ప్రభుత్వం స్పందించి పీస్ రేట్ విధానం రద్దు చేసి లేబర్ కమిషన్ ఇచ్చిన జీవో నం.11 ప్రకారం కనీస వేతనాలు నేరుగా చెల్లించాలన్నారు. స్పందించకపోతే రాష్ట వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్‌లు జి. లక్ష్మయ్య, బి. కృష్ణయ్య, పి. నారాయణ, సోమేష్ తోపాటు పెద్ద ఎత్తున బిల్ కలెక్టర్‌లు పాల్గొన్నారు.

వడ్డెరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చిక్కడపల్లి: వడ్డెరులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వడ్డెర్ల ఆత్మ గౌరవ భవన సముదాయ ట్రస్ట్, తెలంగాణ వడ్డెర సంఘం(గన్ను దెబ్బ) రాష్ట కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీర్లపల్ల శంకర్ హాజరై మాట్లాడారు. సంఘం నాయకులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ట్రస్ట్ చైర్మన్, వైస్ చైర్మన్లు జెరిపేట్ నారాయణ, ఎత్తరి అంతయ్య మాట్లాడుతూ వెనుకబడిన వడ్డెరులు విద్య, ఆర్థికంగా రాణించే విధంగా ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహించాలని, ప్రభుత్వం కాంట్రాక్టు పనుల్లో వడ్డెరులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా వడ్డెరుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. సంఘం నాయకులు ఓర్సు యాదయ్య, ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ ఓర్సు కృష్ణయ్య, నాయకులు బండారు శ్రీరాములు, వెంకట్, శివ భూపతి, తన్నీరు వెంకట కృష్ణ, రాజు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, మోహన్‌రావు, అనంతరావు, బాలరాజు, వేముల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తిచేయాలి


పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాచిగూడ: నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు పూర్తి చేసేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. సోమవారం కాచిగూడ స్టేషన్ రోడ్డు, పర్వరీష్‌బాగ్ పెట్రోల్‌బంక్ రోడ్డులో రూ.1.8కోట్ల వ్యయంతో నిర్మించనున్న స్టామ్ వాటర్ (వరద నీరు వెళ్లడానికి) పైపులైన్ పనులను కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో కాచిగూడ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేసుకున్నామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అంబర్‌పేట నియోజవకవర్గ పరిధిలోని అన్ని డివిజన్‌లలో పెండి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, సునిల్ బిడ్లాన్, బి.కృష్ణాగౌడ్, ప్రతిభ, శ్రీశైలం, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, వరలక్ష్మి, సంతోష్ పాల్గొన్నారు.

ముగ్గురు సెల్‌ఫోన్ దొంగల రిమాండ్

కాచిగూడ: జల్సాలకు అలవాటు పడి రద్దీగా ఉన్న ప్రాంతాలను ఎంచుకుని సెల్ ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను కాచిగూడ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన వర్ధన్ (19), అదే ప్రాంతానికి చెందిన గణేష్ (19), నర్సింహ (22) వీరు ముగ్గురు జులాయిగా తిరుగుతూ రాత్రి సమయాల్లో రద్దీగా ఉండే పలు ప్రాంతాలు, బస్టాండ్‌లలో సెల్‌ఫోన్‌లను దొంగిలిస్తున్నారు. వాటిని అమ్ముతూ వచ్చిన డబ్బులతో మద్యం సేవిస్తూ జల్సాలు చేస్తుంటారని తెలిపారు.

◆ ఈనెల 1వ తేదీన బాలస్వామి అనే వ్యక్తి బర్కత్‌పుర తెలంగాణ యువతి మండలి సమీపంలో పోస్టర్లు అతికిస్తుండగా... వర్ధన్, గణేష్, నర్సింహ అతడిపై దాడిచేసి జేబులో ఉన్న ఖరీదైన సెల్‌ఫోన్ తీసుకొని పారిపోయారు. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వర్ధన్, గణేష్, నర్సింహలను ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని కాచిగూడ పోలీసులకు అప్పగించారు. వారి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్ఐ హెచ్.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(45) కాచిగూడ రైల్వే స్టేషన్ వెనుక వైపు రోడ్డుపై మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.